# రేపటి తెలుగు కోసం

**- ఏలూరిపాటి అపర్ణ**

మా అబ్బాయి చిన్నప్పుడు కథలపుస్తకాలు బాగా చదివేవాడు. వాడు ఒకసారి (౮,౯ ఏళ్ళ వయస్సు ఉన్నప్పుడు) ఒక చందమామ కథ చదివాడు.. అందులో సింహనికి భయపడి కుందేలు చెట్టుపైకి ఎక్కితే, కిందనున్న సింహాం గర్జిస్తూ, 'కిందికి రా. నిన్ను నంజుకుతింటాను.' అంటుంది. ఆ మాట వీడికి బాగా నచ్చి, నా దగ్గరికి పరిగెట్టుకొచ్చి ఆ మాట చదివి వినిపించాడు. ఎందుకో వాడికి ఆ మాటలో ఏదో దగ్గరితనం, ఆత్మీయత కనిపించాయి.. రోజూ వినే నంచుకోవటం అనే మాట కథలో కనపడేసరికి వాడికి ఒకలాంటి సరదా కలిగించిందన్నమాట. ఇప్పటికి వాడు ఆమాటను అప్పుడప్పుడు సరదాగా ఫ్రెండ్స్ మీద ప్రయోగిస్తుంటాడు.. 'మా ఇంటికి రారా, నీ మెదడు నంజుకుతింటాను.' అంటూ.

అలాగే మా అమ్మాయి ఒకసారి తెలుగు న్యూస్‌పేపర్ లో 'ఆ అంశం ఇప్పటికి రావణకాష్ఠంలాగా రగులుతూనే ఉంది' అనే వాక్యాన్ని చదివి, 'అంటే ఏమిటి'అని నన్ను అడిగింది. నేను రావణాసురుడు చాలా దీర్ఘకాయుడు, అతని చితి ఇప్పటికి మండుతూనే ఉందని పురాణగాథ. అది జాతీయమయ్యింది. ఎప్పటికి పరిష్కరించబడని, ముగింపులేని సమస్యలను, విషయాలను రావణ కాష్ఠంలాగా రగిలిపోవటం అంటారు అని వివరించాను. అప్పటినుంచి తను ఎక్కడ ఏ విషయం చదివినా, అందులోని జాతీయాలను, సామెతలను పరిశీలిస్తూ, వాటి అర్థాలు తెలుసుకుని ఎంజాయ్‌చేస్తూ మరీ చదువుతూ ఉంటుంది.

ఈ విషయాలు ఎందుకు చెప్పానంటే, పిల్లలే కాదు పెద్దలుకూడా తాము విన్న, లేదా చదివిన విషయం మీద ఆత్మీయతను అంటే మనది అనే భావాన్ని పెంచుకోవాలంటే ఆ భాష వాళ్ళకు బాగా పరిచయం అయినదయ్యుండాలి. చిన్నప్పటి నుంచి విన్నదయ్యుండాలి. లేదా బాగా అభ్యాసం చేసిన-దయ్యుండాలి.

అసలు భాష అనే మాట 'భాషణం' అంటే మాట్లాడడం అనే దానినుంచి పుట్టింది. భాష యొక్క ముఖ్యఉద్దేశ్యం మన భావాన్ని ఇతరులకు, ఇతరుల భావాలను మనకు తెలుపుకోవటానికే కదా. నిజానికి దేశదేశాలలో ఎన్నో భాషలు పుట్టీ, ప్రాచుర్యాన్ని పొంది, విశ్వవ్యాపితాలైనప్పటికి, భాషయొక్క ముఖ్య ఉపయోగం భావాలను వ్యక్తపరచటమే. కాలక్రమేణా భాష కేవలం భావ వినిమయానికే కాక, విషయాలను నిక్షిప్తం చెయ్యటానికి కూడా ఆలంబన అయ్యింది. దాని కోసం రాత అవసరమయ్యింది. అందువల్ల లిపి ఏర్పడింది. గతంలో జరిగిపోయిన విషయాలను గ్రంథాలద్వారా, ఇప్పుడు జరుగుతున్న విషయాలను వార్తాపత్రికలద్వారా




రాబోయే తరాలకు, మన సమక్షంలో లేనివారికికూడా తెలపటానికి, తద్వారా విషయం కేవలం మాట్లాడటం తోనే ముగిసి పోకుండా శాశ్వతంగా నిలబడడానికి కూడా లిపి దోహద పడుతోంది.

అయితే సాధారణంగా పిల్లలు చిన్నప్పుడు తమ భావాలను చెప్పటానికి తమ సొంత భాషనే అంటే మాతృభాషనే మాధ్యమంగా ఉపయోగిస్తారు. అంటే కొత్తభాషకోసం పాకులాడకుండా మన సొంతభాషనే, అంటే చిన్నప్పటినుంచి తమ పరిసరాలలో, తల్లిదండ్రుల దగ్గర, ఇతర కుటుంబసభ్యుల దగ్గర ఏ భాషనైతే నేర్చుకుంటారో ఆ భాషనే తమ ఆలోచనలకు కూడా ఉపయోగిస్తారు. అందులోనే ఆలోచిస్తారు, పదాలను కూర్చుకుంటారు, చెపుతారు. కాబట్టి, అది వారికి మాతృభాష అవుతుంది.

అయితే, నేటి కాలంలో ఏది మాతృభాష అనేది ప్రశ్నార్థకమౌతోంది. నిడదవోలు మాలతిగారు తెలుగు

జ్యోతి జూలై - ఆగస్టు పత్రికలో తన 'కులదీపకుడు' అనే కథలో ఒక చక్కని మాట చెప్పారు. అందులో కొడుకు తల్లితో "అమ్మా మనం ఈనాడున్నది అయోమయస్థితిలో. సమస్తం, సందిగ్ధం, అస్తవ్యస్తం, గందరగోళం - ఈ యుగాన్ని గజిబిజియుగం అనవచ్చు." అంటాడు. నిజమే. ఈ మాట అక్షర సత్యం. ఏ ఒక్క విషయానికో సందర్భానికో కాదు. అన్ని విషయాలకు ఈ మాట వర్తిస్తుంది. చివరికి భాష విషయంలో కూడా. నిజంగా మాతృభాష అనే మాట పూర్తిగా గజిబిజిగా గందరగోళంగా తయారయ్యింది.

ముఖ్యంగా పిల్లలకు ఈ అవస్థ మరి ఎక్కువ వుతోంది. వారు చిన్నప్పుడు తల్లి కడుపులో ఉన్నప్పటి నుంచి వినే భాష వేరు. స్కూలుకు వెళితే వినేది, నేర్చేది, చదివేది అన్ని వేరు. చివరికి ఆలోచించడంలో కూడా ఎందులో ఆలోచించాలో వారికి తెలియదు. ఎవరు నిర్దేశించనూలేరు.

ఎక్కడో పరాయిదేశంలో పుట్టి, అక్కడి సంస్కృతిని, భాషను నేర్చుకుంటున్న పిల్లలకే కాదు. సొంత ప్రాంతం లోని వారికి కూడా ముఖ్యంగా తెలుగు పిల్లలకు కూడా తమ మాతృభాష ఏమిటి అని అడిగితే ఆలోచించ కుండా చెప్పలేని పరిస్థితి. మరి భాష విషయంలోనే ఇలా ఉంటే ఇంక ఆ భాషలోని సాహిత్యం విషయానికి వస్తే మరీ దయనీయస్థితి. పూర్వకాలంలో ప్రతి ఇంట్లోనూ అంతో ఇంతో భాషాపరిజ్ఞానం ఉన్నవారై ఉండేవారు. ముద్రణ అనేది లేని రోజుల్లో వారు తమ రచనలకు తాళపత్రాలను ఉపయోగించేవారు. నిజానికి ఇప్పుడు మనం ప్రాచీనగ్రంథాలని ముద్రించుకుని చదువుతున్న గ్రంథాలు అందులో ఒక శాతం కూడా ఉండవేమో. రకరకాల దండయాత్రలకు, పరాయిపాలనకు గురై, ఉనికిని కోల్పోయిన భారతదేశం చివరికి తన సాహిత్య సంపదను కూడా చాలా చాలా కోల్పోయింది. తరాలు గడిచి, శిథిలమైపోయి, చెదలు తినెయ్యగా మిగిలిన తాళపత్ర గ్రంథాలను వాటి విలువ తెలియని తరువాతి తరాలవారు చిత్తుకాగితాలకన్నా ఘోరంగా పొయ్యి అంటించుకోవటానికి, లేదా తూకాలకు కూడా అమ్మేశారని, అలా కొంత సాహిత్యం నశించిపోగా, దొరికినంతవరకు కొన్ని విదేశాలకు తరలించాబడ్డాయని విన్నప్పుడు చాలా బాధ కలుగుతుంది.

సరే పోయింది రాదు. ఉన్నవైనా అన్నీ చదవటానికి, అర్థం చేసుకోవటానికి మన ఆయుస్సు, మన పరిజ్ఞానం సరిపోతాయా అంటే అదీ అసంభవమే. ఎన్నో కథలు, కవితలు, నవలలు, నాటికలు యాత్రా రచనలు, చరిత్ర గ్రంథాలు, శాస్త్రగ్రంథాలు, పరిశోధనలు, నిఘంటువులు, విజ్ఞానసర్వస్వాలు తెలుగులో ఉన్నాయి. అవన్నీ కనీసం ఒక్కసారి చదవటానికి కూడా మన జీవితకాలం సరిపోదు. ఎంతోకొంత తెలుగు తెలిసిన మన పరిస్థితే ఇలా ఉంటే అసలు తెలుగు పలకటం, అర్థం చేసుకోవటం తెలియని తరువాతి తరాల పరిస్థితి ఏమిటి? ఈ క్రమంలో తెలుగుభాష పరిస్థితి ఏమిటి? అని ఆలోచిస్తే జవాబు దొరకదు.

నిజానికి ఈ రోజు ఆంధ్రప్రదేశ్‌లోకూడా తెలుగు సరిగా రాని పిల్లలు ఎందరో ఉన్నారు. మా పిల్లలకు తెలుగు రాదు అని చెప్పుకోవటం ఒక ఫ్యాషన్ కూడా. పెద్దవాళ్ళలో కూడా కేవలం భాష అంటే మాట్లాడేది అన్నట్టే కాని, అది ఒక సంస్కృతీవారసత్వం అనే భావన ఉండటం లేదు. 'అమ్మా నీ కోసం ఎవరో వచ్చారు' అనే మాట కన్నా, 'మామ్ ,సం ఆంటి కేమె ఫర్ యూ ' అన్న మాటను వాళ్ళూ సంతోషంగా స్వీకరిస్తున్నారు.

కనీసం స్కూళ్ళలో కూడా ఇంగ్లీష్ తర్వాతి స్థానాన్ని కూడా తెలుగు నేర్చుకోవటానికి ఇవ్వటంలేదు. పిల్లలకు జాతీయభాష అని హిందీని, లేదా ఫ్రెంచి, జపనీస్ వంటి విదేశీభాషలను నేర్పించటానికి చూపించే ఉత్సాహం తెలుగు పట్ల చూపించటంలేదు. నేర్పించటం లేదు నేటి తల్లితండ్రులు.

వీటన్నింటికి తోడు తెల్లవారిలేస్తే చూసి, విని ఆనందించే టీ.వీ. చానెల్స్ కూడా తెలుగు భ్రష్టు పట్టి పోవటానికి తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి. ఆ యాంకర్స్ మాట్లాడే మాటల్లో ఇంగ్లీషు చాలా చక్కని ఉచ్చారణతో ఉంటుంది. తెలుగు మాత్రం తింగ్లిష్ లాగానే ఉంటుంది. అదీ పరిస్థితి.

కన్యకుమారి నుంచి కాశ్మీరు వరకూ విస్తరించి ఉన్న మన సువిశాల భారతదేశం భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక. ఆయా ప్రాంతాల వైవిధ్యాన్ని పూలదండలోని దారంలాగా పట్టి ఉంచేవి భారతీయ సంస్కృతి, భారతీయ సాహిత్యం. వ్యాసుడు, వాల్మీకి, కాళిదాసు వంటివారు సంస్కృతంలోనే రచించినా, ఆయా గ్రంథాలు అన్ని భారతీయ భాషల్లోను కావ్యాలుగా, నాటకాలుగా, కథలుగా, జానపద కళా రీతులుగా రూపుదిద్దుకున్నాయి. ఆర్ష సాంప్రదాయనికి, భారతీయాత్మకు నిలువెత్తు దర్పణాలు ఆ కావ్యాలు.

మన సాహిత్యంతో తగుమాత్రమైనా పరిచయం లేకపోతే వివిధ భారతీయభాషల్లోని సాహిత్యాన్ని అవగాహన చేసుకోవటం చాలా కష్టం. ప్రాచీన-నవీన సాహిత్య పఠనం అలవాటు లేకుంటే మనప్రాంతాల గురించిన స్థలపురాణాలు, దివ్యక్షేత్రాలు, పుణ్యతీర్థాల మహాత్మ్యాన్ని గురించి తెలియదు. కొన్ని పదబంధాలు, జాతీయాలు, ఉపమానాలు, కథలు, పొడుపుకథలు, వాటి అర్థాలు తెలియవు. సమగ్రత రాదు.

పత్రికల్లో వచ్చే కవితల్లో, కథల్లో, నాటికల్లో, కార్టూన్లలో ఇంకా మనం రోజూ వాడే సామెతలు, జాతీయాలు, నానుడులు ఇవన్నీ మన సాహిత్యం, అందులోనూ పురాణకథలు తెలియకపోతే అసలు అర్థమే కావు. ఉదా: ధృతరాష్ట్రకౌగిలి, రావాణకాష్టం, లక్ష్మణ రేఖ' ఇలాంటి పదాలకు అర్థాలు తెలియాలంటే ఆయా పురాణాలు తెలియాలి. అప్పుడే వాటి మీద ఆత్మీయత కలుగుతుంది. అదే నేటివిటీ అంటే.

ఇంతటి ప్రాధమ్యాన్ని కలిగిన తెలుగును నేర్చుకోవటం, చదవటం రేపటిపౌరులకు ఎంతైనా అవసరం. మనం మన మూలాలు, వాటి విలువలూ తెలుసుకోవాలంటే ప్రతివారు మాతృభాషను చక్కగా నేర్చుకోవలసిందే. నేటి ఉరుకులు-పరుగుల జీవనవిధానం పిల్లలను పుస్తకాలు చదవటం అనే అలవాటుకు దూరంచేస్తోంది. కాని, మనిషి ఆకాశంలో విహరించినా, భూమే అతనికి ఆధారమైనట్టుగా ఎవరెవరు ఎంత చదువులు చదివినా, ఏయే విద్యలు నేర్చినా మాతృభాషను కూడా తప్పనిసరిగా నేర్చుకోవాలి. లేకపోతే నేల విడిచిన పామే అవుతుంది. పక్క ఇంటి ఆంటి ప్రేమతో పిండివంటలు పెట్టినా, అవి అమ్మ అప్యాయంగా పెట్టే కమ్మని వంటకాలు కావుకదా.

కాబట్టి మనందరం మన పిల్లలకు చక్కని తెలుగును నేర్పటం, మంచి పుస్తకాలను చదివింప చేయటం, ముఖ్యంగా ఇంటివాతావరణాన్ని తెలుగులో ఉంచడం చేయాలి. అప్పుడే వారికి సరైన ఆలోచనా రీతి, చక్కని భావాలు, వ్యవహారిక దృక్పథం అలవాటు అవుతాయి. పంచతంత్రకథల్లో కేవలం కథలు వినటం వల్లనే రాజకుమారులు లోకజ్ఞానాన్ని పొందారని మనం చదువుకున్నాం కదా. పిల్లలకు మాతృభాషలోని కథలు, గేయాలు వినిపించడం, చదివించటం, వారిచేత చెప్పించడం చేస్తుంటే తెలుగులోని పదాలు, అర్థాలు, సమానార్థకాలు, నానార్థాలు, జాతీయాలు, నానుడులు, సామెతలు అన్ని వారు తెలుసుకుంటారు. ఎంజాయ్ చేస్తారు. అమృతతుల్యమైన తెలుగుభాష మృతసదృశం కాకుండా రేపటికీ, ఎప్పటికీ, తరతరాలా నిలిచి ఉంటుంది. ****

---

*Contd from Page… 114*

## పిలుపు

పెళ్ళిల్లు, పుట్టినరోజులు, స్వీట్ సిక్స్‌టీన్‌లు, అంత తఱుచుగా వచ్చే కార్యక్రమాలు కావు. అందుకై కొంత సమయం వెచ్చించడం, సన్నిహితులను ఆప్యాయంగా - ఆహ్వానించడంలో తప్పేమిటో తలబద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు.

రాజ్ మనసులో మాట ఆనంద్‌కు తెలిసినట్లుంది. 'అదంతే డాడ్, నీకు అర్థం కాదు.' అన్న మాటలకు ఈ లోకంలోకి వచ్చాడు రాజ్.

ఇంతకూ, వాళ్ళ అబ్బాయి చేసిన ఘన కార్యం, - ఆనంద్ మాటల్లో,

'వెరీ సింపుల్! tweets పంపాను, రివర్స్ confirmation tweets వచ్చాయి. అవి count చేసి నీకు చెప్పా!'****



## మీ ఇంటి గేటు

**- తమ్మినేని యదుకుల భూషణ్**

తడిసి రాలిన ఆకులు
తడుముతాయి పాదాలను
మీ ఇంటిగేటు మీద నిలిచిన నీరు
చేయిని తడుపుతోంది హాయిగా

వాన వెలిసింది
కానీ, మబ్బులు అలాగే
అడుగుల చప్పుడు వినిపిస్తుందా?
అడగాలని లేదు ఏమీ ...